సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 12 | మే | 2025



పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి

సరస్వతినది పుష్కరాల పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. - 8లో ▸



మళ్లీ సాయంత్రం బడులు

సంపూర్ణ అక్షరాస్యత కోసం ప్రభుత్వం మళ్లీ సాయంత్రం బడులు ప్రారంభించనుంది. సామాజిక చైతన్య కేంద్రాల పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. - 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
$40^0/28^0$

వాతావరణం

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజన పథకాన్ని 'అక్షయపాత్ర'కు ఇవ్వొద్దు



విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని హనుమకొండ జిల్లాలో 'అక్షయపాత్ర'కు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులు సకాలంలో రాకపోయినా విద్యార్థులకు వంటచేసి పెడుతున్నారని అన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిడిగొండ రజిత, బాధ్యులు కె.శాంత, సుక్కు బాయి, కె.కవిత, స్వప్న, రాణి, విజయ, శారద,వసుంధర, తస్లీమ్, సరిత పాల్గొన్నారు.

'పాలిసెట్' ఏర్పాట్లు పూర్తి



బైరి ప్రభాకర్

రామన్నపేట: జిల్లాలో ఈనెల 13న (మంగళవారం) నిర్వహించనున్న పాలిసెట్ -2025 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడేళ్ల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు, వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా ప్రవేశాలకు నగరంలోని 12 పరీక్ష కేంద్రాల్ని ఏర్పాటు చేయగా.. వీటిలో 6,424 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని, 11 గంటల తర్వాత అభ్యర్థులను అనుమతించరని సూచించారు.

నేటి గ్రేటర్ గ్రీవెన్స్ రద్దు

వరంగల్ : బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో సోమవారం(నేడు) నిర్వహించే గ్రేటర్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో ఈనిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న ఆమె.. నగర ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇవ్వడానికి రాకూడదని సూచించారు.

సాధు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



నయీంనగర్: సాధు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షుడు అంబికేశ్వరానంద భారతి ఈమేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గో సంరక్షణ, సాధు సంరక్షణ, గీతా సంరక్షణ, వేద సంరక్షణ, సనాతన పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

డబుల్ ధమాకా

వరంగల్ ఆర్వోలో 'డబుల్ స్లాట్ బుకింగ్స్'

- నేటి నుంచి ప్రారంభం
- భూక్రయవిక్రయదారులకు తప్పనున్న తిప్పలు



వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయం

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఎంపిక చేసిన రిజిస్ట్రేషన్ కార్యాలయానికి 48 సాధారణ స్లాట్ బుకింగ్స్‌తో పాటు 5 ప్రత్యేక స్లాట్స్ ఉండగా.. వరంగల్ ఆర్‌ఓకు డబుల్ ధమాకాలో భాగంగా.. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లకు 96 స్లాట్స్‌తో పాటు ప్రత్యేక స్లాట్స్ 10 కేటాయించనున్నారు. సోమవారం(నేడు) నుంచి డబుల్ స్లాట్ ప్రారంభం కానుంది.

15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్

కోరుకున్న సమయానికి, కోరుకున్న తేదీన కేవలం 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని దస్తావేజులను సైతం భూక్రయ విక్రయదారులు పొందేందుకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ గత నెల 10న స్లాట్ బుకింగ్స్ సిస్టమ్‌ను ప్రారంభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. వరంగల్ ఆర్వోలో జాయింట్-1, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ హోదా కలిగి ఉంటుంది. దీంతో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వహించనున్నారు. మిగతా వాటిల్లో కేవలం ఒక్క సబ్ రిజిస్ట్రార్ మాత్రమే అందుబాటులో ఉంటారు.

నాలుగు కార్యాలయాల్లో 'స్లాట్' సిస్టం

వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈనెల 12 నుంచి స్లాట్ బుకింగ్స్ సిస్టమ్ ప్రారంభం కానుంది. రోజూ 48 స్లాట్ బుకింగ్స్.. ఇందులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 24, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 వరకు 24 స్లాట్ బుకింగ్స్ సాధారణ ప్రజలకు, సాయంత్రం 5 నుంచి 6 వరకు దివ్యాంగులకు, వయోవృద్ధులకు, పేషెంట్లకు మరో 5 స్లాట్ బుకింగ్స్ అవకాశం కల్పించారు.

తప్పనున్న తిప్పలు..

వరంగల్ ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోజూ 160 నుంచి 180 దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం ద్వారా దస్తావేజుల మ్యుటేషన్, స్కానింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే.. స్లాట్ బుకింగ్ సిస్టంతో 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్‌తో పాటు దస్తావేజులు చేతికందే అవకాశం ఉంది. కొన్ని సమయాల్లో రాత్రి 8 గంటల వరకు సైతం రిజిస్ట్రేషన్లు జరిగేవి. దీంతో అధికారులతో పాటు భూక్రయవిక్రయదారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

సమయానికి రావొచ్చు..



స్లాట్ బుకింగ్ సదుపాయంతో ఆన్‌లైన్‌లో ఎంచుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి భూ క్రయ విక్రయదారులు రానున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తవ్వగానే దస్తావేజులు చేతికందుతాయి. స్లాట్ బుకింగ్స్‌తో భూక్రయవిక్రయదారులతో పాటు కార్యాలయ సిబ్బందికి సమయ పాలన అలవాటవుతుంది.

- ఆనంద్, సబ్‌రిజిస్ట్రార్, వరంగల్ ఆర్‌ఓ

ముందస్తు బడిబాట

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు నిర్ణయం
- ఏటేటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- హనుమకొండ జిల్లాలో జీరో పిల్లలున్న పాఠశాలలు 54
- 20 మందిలోపు ఉన్నవి 196

విద్యారణ్యపురి: గతంలో కంటే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగ్గానే మౌలిక వసతులు కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, హైస్కూల్ స్థాయిలో వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ అందిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన. బీఈడీ, డీఎడ్‌పాటు ఉన్నత విద్య కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులే విద్యాబోధన చేస్తున్నారు. అయినా.. హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ స్కూళ్లలో విద్యార్థుల నమోదు ఏటేటా తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంపుదలపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

విద్యార్థుల్లేని పాఠశాలలనూ తెరుస్తారు..

విద్యార్థుల్లేని పాఠశాలలో ఉపాధ్యాయులను ప్రతీ ఏడాది ఎక్కువ మంది పిల్లలున్న పాఠశాలలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై పంపిస్తున్నారు. అయితే.. ఈ విద్యాసంవత్సరంలో ఆయా పాఠశాలలను తెరిచి ఉపాధ్యాయులను పంపుతారు. దీంతో వారు ఇప్పటినుంచే ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను బడిలో చేర్పించుకోవాల్సి ఉంటుంది.

54 పాఠశాలల్లో జీరో..

హనుమకొండ జిల్లాలోని 54 ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య జీరో ఉంది. అందులో పీఎస్‌లు 44, యూపీఎస్‌లు 7, హైస్కూల్స్ మూడు ఉన్నాయి. 20మందిలోపు పిల్లలున్న పాఠశాలలు 196వరకు ఉన్నా యి. ఈ పాఠశాలల్లో సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఆ పాఠశాలల మనుగడే ప్రశ్నార్థకంగా మారనుంది.

హెచ్‌ఎంలతో సమావేశం

వేసవి సెలవుల్లోనే గ్రామీణ, పట్టణప్రాంత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య పెంచడానికి ముందస్తుగానే 'బడిబాట' నిర్వహించాలని డీఈఓ వాసంతి ఇటీవల సూచించారు. ఈమేరకు టీచర్ల సంఘాలు, 20మందిలోపు విద్యార్థులున్న హెచ్‌ఎంలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు.

వీర జవాన్లు అమర్ రహే..

- వేయిస్తంభాల ఆలయం నుంచి కాగడాల ర్యాలీ



అమర జవాన్‌కు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హన్మకొండ చౌరస్తా /హన్మకొండ: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన తెలుగుతేజం మురళీనాయక్, మరెందరో జవాన్ల వీరోచిత పటిమను స్మరిస్తూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వేయిస్తంభాల గుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన భారీ ర్యాలీ నిర్వహించారు. ఒక చేతిలో కాగడా, మరో చేతిలో జాతీయ జెండాలతో యువకులు వందేమాతరం, భారత్‌మాతాకీ జై, జై జవాన్, జై కిసాన్, మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాకేశ్‌రెడ్డి భారత సైన్యానికి రూ.25 వేల చెక్కును అందజేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ వంద శాతం విజయవంతమైందని రాకేశ్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రిటైర్డ్ సోల్జర్ ప్రభాకర్, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఇండస్ ఫౌండేషన్ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్ రోడ్లకు మహర్దశ

స్పెషల్ రిపేర్స్, బీటీ, నిర్మాణాలకు పెద్దపీట

- మరమ్మతులు, కొత్త రోడ్లపై తారుకు నిధులు
- ఐదు జిల్లాల్లో 62రోడ్లకు రూ.69.33 కోట్లు...
- ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచిన పంచాయతీరాజ్ శాఖ
- ఈనెల 17తో ముగియనున్న ప్రక్రియ



సాక్షిప్రతినిధి, వరంగల్ :

- వరంగల్ జిల్లా గీసుకొండ నుంచి మొగిలిచర్ల ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డు స్పెషల్ రిపేర్స్ కోసం రూ.1.57 కోట్లతో అంచనా వేశారు. రూ.1,22,93,509లకు ఆన్‌లైన్ టెండర్ పిలువగా ఈనెల 17న గడువు ముగుస్తుంది.
- హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారం జీడీపీ రోడ్డు నుంచి అలియాబాద్ ద్వారా కామారెడ్డిపల్లి వరకు రోడ్డు ప్రత్యేక మరమ్మతులకు రూ.2 కోట్లతో అంచనాలు పంపారు. ప్రభుత్వం రూ.158,09,702లకు పరిపాలన అనుమతి ఇవ్వగా ఆన్‌లైన్ టెండర్ ద్వారా ఈనెల 17 తర్వాత పనులు ఖరారు చేయనున్నారు.
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ నుంచి బేరువాడ పీఆర్ రోడ్డు (మంచతండా) వరకు కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.1,25,48,271లతో టెండర్లు పిలువగా, ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో దాఖలుకు అవకాశం ఉంది.

.. ఇలా ఉమ్మడి వరంగల్‌లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఐదు జిల్లాల్లో పాత రోడ్లకు స్పెషల్ రిపేర్స్, అత్యవసర మరమ్మతులు, మట్టి రోడ్లపై తారు వేయడంతో పాటు రోడ్డులేని గ్రామం లేకుండా కొత్తరోడ్లు నిర్మించేందుకు ఈ నిధులు మంజూరు చేసింది. మొదటి విడతగా హనుమకొండ, వరంగల్, ములుగు, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో రూ.69.33 కోట్లతో 62 రోడ్లకు గత నెలాఖరులో నిధులు మంజూరు చేసింది. ఈమేరకు అర్హులైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించేందుకు పంచాయతీరాజ్ శాఖ వరంగల్ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయం నుంచి టెండర్లు పిలిచారు. ఈనెల 8 నుంచి 17 తేదీ వరకు టెండర్ షెడ్యూల్ దాఖలు చేయడానికి అవకాశం ఇచ్చారు.

మానుకోటకు పెద్దపీట

గత వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లు పలు ప్రాంతాల్లో మరమ్మతులకు నోచుకోకపోగా.. మళ్లీ వర్షాకాలం సమీపిస్తోంది. ఈనేపథ్యంలో నియోజకవర్గాల వారీగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులతో పాటు స్పిల్‌ఓవర్ పనులకు ఎమ్మెల్యేలు పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రతిపాదనలు పంపారు. 62 రోడ్లపై సుమారు రూ.75 కోట్ల మేరకు అవసరం ఉంటుందని ఎస్టిమేట్స్ రూపొందించగా, రూ.69.33 కోట్లు విడుదలయ్యాయి. హనుమకొండ జిల్లాలో 15 రోడ్లకు రూ.5.92 కోట్లు కేటాయించగా, ములుగు 11 రోడ్లకు రూ.17.10 కోట్లు, జేఎస్ భూపాలపల్లికి ఐదు రోడ్లకు రూ.7.61 కోట్లు, వరంగల్ 10 రోడ్లకు రూ.9.20 కోట్లు కాగా, మహబూబాబాద్ జిల్లాలో 21 రోడ్లకు రూ.27.50 కోట్లు నిధులు మంజూరు చేశారు. మొత్తంగా విడుదలైన సుమారు రూ.69.33 కోట్లలో మానుకోటకు పెద్దపీట లభించింది.

కళల విశిష్టతను నలువైపులా చాటాలి

- అన్నమాచార్య అకాడమీ వ్యవస్థాపకులు సూత్రపు అభిషేక్



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న సూత్రపు అభిషేక్, గాయకులు

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లు ఖ్యాతిని, కళల విశిష్టతను నలువైపులా చాటాలనే సంకల్పంతో ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అన్నమాచార్య అకాడమీ వ్యవస్థాపకులు సూత్రపు అభిషేక్ అన్నారు. అన్నమయ్య సాహితీ కళా వికాస పరిషత్ సౌజన్యంతో తెలుగు వాగ్గేయకారులు, పదకవితా పితామహులు తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంత్యుత్సవం, అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సూత్రపు అభిషేక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో నగరానికి చెందిన కళాకారులతో పాటు వివిధ జిల్లాలకు చెందిన వందకుపైగా కళాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ప్రదర్శించిన సంగీత, నృత్యాలు అలరించాయి.

టీచర్లకు 'నైపుణ్య' శిక్షణ

రేపటి నుంచి 17 వరకు మొదటి దశ

- ఒక్కో టీచర్‌కు ఐదురోజులపాటు..
- మరో రెండు దశలు కూడా..
- ఇప్పటికే డీఆర్పీలకు శిక్షణ పూర్తి



విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల సాధనకు అన్ని కేటగిరీల టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఒక్కో టీచర్‌కు ఐదు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో భాగంగా డిజిటల్ విద్యకు, కంప్యూటర్ ద్వారా ఏఐ ఆధారిత విద్యా బోధన, లీడర్‌షిప్ లక్షణాల పెంపుదల, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు వివిధ సబ్జెక్టుల విద్యా బోధనపై జీవన నైపుణ్యాలపై, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు (ఐఎఫ్‌బీ) వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

మూడుదశల్లో

వేసవి సెలవుల్లో హనుమకొండ జిల్లాల్లోని టీచర్లకు మూడు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 13 నుంచి 17 వరకు మొదటి, ఈనెల 20 నుంచి 24 వరకు రెండో దశ, ఈనెల 27 నుంచి 31 వరకు మూడో దశలో టీచర్ల శిక్షణ ఉండనుంది. స్కూల్ అసిస్టెంట్లకు, ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంలకు, గెజిటెడ్ హెచ్‌ఎంలకు, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లకు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు, ఎస్జీటీలకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఎక్కడంటే..

హనుమకొండ భీమారంలోని స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మొదటిదశలో ఈనెల 13 నుంచి 17 వరకు వివిధ కేటగిరీల టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. మొదటిదశలో స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లిష్ (100), మ్యాథ్స్ (100) సోషల్ స్టడీస్ (100), ఎస్జీటీ ఎంఆర్పీలు (112), స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 33 మంది, ఎస్జీటీ ఉర్దూ మీడియం కేటగిరీలో 50 మందికి హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శిక్షణ ఉంటుంది. హాజరయ్యే టీచర్లకు మధ్యాహ్న భోజనం, టీ, స్నాక్స్, తాగునీటి సదుపాయం కల్పిస్తారు. శిక్షణ ఇస్తున్న స్కూల్‌లో ఏసీ సదుపాయం ఉన్నందున వేసవిలో శిక్షణ పొందే ఉపాధ్యాయులకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. ఇప్పటికే ఆయా సబ్జెక్టుల్లో శిక్షణ పొందిన డీఆర్పీల ద్వారా ఇప్పుడు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

20 నుంచి 24 వరకు ప్రాథమిక స్థాయి..

జిల్లాలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఎస్జీటీలకు ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంలకు ఈనెల 20 నుంచి 24 వరకు ఎంఈఓల ఆధ్వర్యంలో మండల స్థాయిలో శిక్షణ ఉంటుంది. జిల్లాలో 1,014 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలోని అన్ని కేటగిరీల టీచర్లకు ఈనెల 13నుంచి 17వరకు శిక్షణ ఇవ్వబోతున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈశిక్షణ ఖిలావరంగల్ మండలం ఉర్సుగుట్ట వద్ద ఉన్న బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మొదటి దశలో వనంగల్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు గణితం (224), ఇంగ్లిష్ (179), సోషల్ స్టడీస్ (205) మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మండల రిసోర్స్‌పర్సన్లకు 104 మందికి, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు 34 మందికి, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్లు కలిపి మొత్తం 596 మంది ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు ఉంటుందని విధిగా టీచర్లు శిక్షకు హాజరుకావాల్సిందేనన్నారు.

టీచర్లు విధిగా హాజరుకావాల్సిందే..



జిల్లాలో ఈనెల 13 నుంచి నిర్వహించనున్న టీచర్ల శిక్షణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. టీచర్లు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలి. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలి. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాల సాధన, నాణ్యమైన విద్య నైపుణ్యాల పెంపుదల ముఖ్యమైన అంశాలపై ఒక్కో టీచర్‌కు ఐదురోజులు శిక్షణ ఉంటుంది.

- వాసంతి, డీఈఓ

సమయపాలన పాటించాలి..



ఉపాధ్యాయులు సమయపాలన పాటించాల్సిందే. ప్రతీ సబ్జెక్టుకు కాంప్లెక్స్ హెచ్‌ఎంలను సెంటర్ ఇన్‌చార్జులుగా నియమించాం. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉపాధ్యాయులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉపాధ్యాయులందరికీ ప్రీటెస్ట్, అంతిమ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. హాజరు కూడా ఆన్‌లైన్ ద్వారా ఉదయం శిక్షణ కేంద్రానికి 9:30 గంటల్లోపు వచ్చిన వారిని నమోదు చేస్తారు. జియో కార్డినల్ ద్వారా తమ మొబైల్ నుంచి హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయిన అనంతరం ఆన్‌లైన్ ద్వారానే వారి మొబైల్‌కు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందుతుంది.

- శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్

ప్రజలు హక్కుల కోసం పోరాడాలి


మాట్లాడుతున్న లక్ష్మణ్

నయీంనగర్: తమ జీవనవిధానానికి భంగం కలిగినప్పుడు ప్రజలు హక్కుల కోసం పోరాడాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో పౌరహక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా 3వ మహాసభ పి.రమేశ్ చందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీల సహజ జీవనవిధానాన్ని బలవంతంగా మార్చుకోవాలని వారిపై దాడులు, అక్రమ అరెస్టులు చేయడం వారికి రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాయడమేనన్నారు. ప్రజా ఉద్యమాలపై జరుగుతున్న అణిచివేతను ప్రశ్నించడమే పౌర హక్కుల సంఘం ప్రధాన లక్ష్యం, కర్తవ్యమన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి శాంతి చర్చలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్.పాణి, హైకోర్టు అడ్వకేట్ వి.రఘునాథ్, గుంటి రవి, టీపీఎఫ్ నాయకురాలు బి.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి

నెల్లికుదురు: తాటిచెట్టుపైనుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చీకటి ప్రభాకర్ గౌడ్ (48) రోజుమాదిరిగానే తాటిచెట్టు ఎక్కి కల్లు గీసిన అనంతరం కిందికి దిగుతున్నాడు. ఈ క్రమంలో జారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న ఓ వ్యక్తి చూసి సమాచారం అందించగా కుటుంబ సభ్యులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని చూడగా అప్పటికే మృతి చెందాడు. ప్రభాకర్‌గౌడ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కురవి: కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కురవి మండలం గుండ్రాతిమడుగులో చోటు చేసుకుంది. పీఎస్సై కృష్ణారెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గుంజె లక్ష్మణ్(34)కు కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన కల్పనతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. లక్ష్మణ్ నెల రోజుల క్రితం గుండ్రాతిమడుగు(విలేజీ)కు వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబకలహాలు, ఆర్థిక సమస్యలతో శనివారం రాత్రి పురుగుల మందు తాగి రైల్వే ట్రాక్ పక్కన ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో పడుకుని ఉన్నాడు. ఆదివారం ఉదయం కొనుగోలు కేంద్రానికి వచ్చిన కొందరు రైతులు లక్ష్మణ్ పడుకుని ఉన్న విషయాన్ని కుటుంబీకులకు తెలిపారు. వారు ఘటనాస్థలికి చేరుకుని చూడగా అప్పటికే మృతి చెంది కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి తమ్ముడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని లక్ష్మణ్ కుటుంబీకులు కరీంనగర్ తరలించారు.

అమ్మమ్మతాతయ్య మందలించారని గొల్లపల్లిలో మరో యువకుడు..


అజయ్ (ఫైల్)

నెక్కొండ: అమ్మమ్మతాతయ్య అకారణంగా మందలించారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని గొల్లపల్లిలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బట్టు అజయ్ (21) తల్లి చిన్నతనంలో మృతి చెందింది. దీంతో అజయ్‌ని అమ్మమ్మతాతయ్య పెంచిపెద్ద చేశారు. అజయ్ తాపీ మేస్త్రీ పని చేస్తుండగా ఈ నెల 10న సాయంత్రం ఇంటి వచ్చాడు. ఎక్కడకి వెళ్లావని, కాళ్లు కడుక్కుని ఇంట్లోకి రావాలని మందలించారు. దీంతో తనను చిన్న విషయాలకే అకారణంగా మందలిస్తున్నారని, స్వేచ్ఛ లేదని అజయ్ మనస్తాపానికి గురయ్యాడు. క్షణికావేశంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి

- గ్రామం మొత్తం విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. ఆదివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతీ(వీఐపీ)ఘాట్ సరస్వతీమాతా విగ్రహం, జ్ఞానదీపం, నదిలో భక్తుల స్నానమాచరించే ప్రదేశం, టెంట్ సిటీ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం టెంట్‌సిటీలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని, మీరే జవాబు చెప్పాలన్నారు. గ్రామం మొత్తాన్ని విద్యుద్దీకరణతో ముస్తాబు చేయాలన్నారు. 12 రోజులు పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పిండ ప్రదాన భవనం అసంపూర్తిగా ఉందని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు నదిలోకి స్నానాలకు వెళ్లడానికి తాత్కాలిక రహదారి ఏర్పాటుతోపాటు క్యియర్ మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా బారికేడ్స్, ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నది వద్ద 50 మంది గజఈతగాళ్లను అందుబాటులో ఉంచి, నాటుపడవలను సిద్ధంగా ఉంచాలన్నారు. మొదటిసారి కాళేశ్వరంలో టెంట్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హారతి కార్యక్రమం పర్యవేక్షణకు దేవాదాశాఖ నుంచి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవానికి వస్తున్నారని, అలాగే తదుపరి రోజుల్లో గవర్నర్, రాష్ట్ర మంత్రులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మహదేవపూర్ నుంచి వీధిదీపాలు ఏర్పాటుతో పాటు డివైడర్ల మధ్యలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు సూచించారు. రహదారులకు మరమ్మతులు నిర్వహించాలని, ఎక్కడా గుంతలు ఉండొద్దని ఆర్ అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద తాత్కాలిక లైటింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ప్రత్యేకాధికారులు స్థానికంగా ఉండి పనులను పర్యవేక్షించాలని తెలిపారు. నిమిషం కూడా కరెంట్ కట్ కావొద్దని, కాటారం, బీరసాగర్ నుంచి విద్యుత్ సరఫరా తీసుకోవాలన్నారు. భక్తులకు ప్రతీ రోజు అన్నదానం చేయాలని స్పష్టం చేశారు. పుష్కరాలు దగ్గర పడుతున్న సమయంలో ఎందుకు స్లాబు వేశారని, పని ఎలా అయిపోతుంది చెప్పండంటూ దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. స్లాబ్ చేయకుండా ఉండాల్సిందని భక్తులు నదిలోకి ఎలా వెళ్తారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, దేవాదాయ శాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, ఈఓ మహేశ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నదిలో బోట్లు తిప్పేందుకు అవకాశం ఇవ్వాలి..

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీనది పుష్కరాల్లో త్రివేణి సంగమంలో బోట్లు తిప్పేందుకు అవకాశం ఇవ్వాలని మంత్రి శ్రీధర్‌బాబును స్థానిక గంగ పుత్రులు వేడుకున్నారు. మంత్రి ఆదివారం కాళేశ్వరానికి రాగా తమ జీవనోపాధి గురించి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేకు గంగ పుత్రులకు అవకాశం ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి వెంట సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్, ఇతర అధికారులు ఉన్నారు.

పూర్వం గుహలో సరస్వతి అమ్మవారు..


ప్రస్తుతం సరస్వతి అమ్మవారి విగ్రహం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధదేవాలయం శ్రీసరస్వతి అమ్మవారు పూర్వం సారంగలోని ఓ గుహలో ప్రతిష్ట చేసి ఉందేదని పురాణాల ద్వారా తెలిసింది. సారంగ మార్గంలో వెళ్లి అమ్మవారిని దర్శించుకునేవారట. ఆ కాలంలో విద్యుత్ వెలుగులు లేకపోవడంతో సూర్యరశ్మి, నూనె దీపాల వెలుగుల్లో వెళ్లి దర్శించుకునేవారు. ఆ అమ్మవారి విగ్రహం భిన్నమై, ఆలయం శిథిలావస్థకు చేరింది. శృంగేరి పీఠాధిపతులు, శారదపీఠాధిపతులు దక్షిణ భారతదేశం పర్యటనలో కాళేశ్వరం మీదుగా వచ్చినప్పుడు గ్రామస్తుల ద్వారా తెలిసినట్లు ఆధారాలు ఉన్నాయి. 1976 తర్వాత జీర్ణోద్దరణ జరిగిన అనంతరం అప్పటి రవాణాశాఖ మంత్రి జువ్వాడి చొక్కారావు చొరవతో దినదినాభివృద్ధి చెందుతోంది. నిత్యం పూజలు చేస్తున్నారు. ప్రతీ వసంత పంచమి రోజు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరుగుతాయి. కాగా, దేశంలో సరస్వతి ఆలయాలు కాళేశ్వరంలోని మహాసరస్వతి, బాసరలోని జ్ఞాన సరస్వతి, కాశ్మీర్‌లోని బాలసరస్వతి విశిష్టత కలిగినవి. ఈ క్రమంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీనది పుష్కరాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

నిరంతరం విద్యుత్ కాంతులు


వీఐపీ ఘాట్ వద్ద పనులు చేస్తున్న టీజీ ఎన్పీడీసీఎల్ సిబ్బంది

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీనది పుష్కరాల్లో విద్యుత్ కాంతులు నిరంతరాయంగా అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది రాత్రిపగలు శ్రమిస్తున్నారు. ఎస్ఈ మల్చూర్ నాయక్, డీఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు, ఏఈ శ్రీకాంత్, కాళేశ్వరం లైన్‌ఇన్‌స్పెక్టర్ సదానందం నిరంతరం అందుబాటులో ఉంటూ పనులు త్వరితగతిన చేయిస్తున్నారు. రూ.కోటిన్నరతో కాళేశ్వరంలో మొత్తం 500 వరకు స్తంభాలు, రూ.2 కోట్లతో సబ్‌స్టేషన్‌లో రెండు ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 100 కేవీఏ, 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 20 వరకు అమర్చారు. దీంతో కాళేశ్వరం అంతటా 24 గంటల త్రీఫేజ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రోజుకు 50 మంది సిబ్బంది పనులు చేస్తుండగా, పుష్కరాల సందర్భంగా 80 వరకు పెంచుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పుష్కరఘాట్ పులకించేలా..


డెకరేషన్ పనులు చేస్తున్న కూలీలు

కాళేశ్వరం: సరస్వతీ పుష్కరాలకు పుష్కరఘాట్ వద్ద పనులు చకచకా జరుగుతున్నాయి. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతీమాత విగ్రహానికి డెకరేషన్ చేస్తున్నారు. పుష్కరఘాట్ పొడువునా భారీగా సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. శివుడి విగ్రహం, దాని ఎదుట నంది విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. కాశీపండితులతో ఏడు హారతులు ఇచ్చే సభాస్థలి వద్ద ప్రత్యేకంగా హైదరాబాద్‌కు చెందిన కేంఎంకే గ్లోబల్ లిమిటెడ్ ప్రైవేట్ సంస్థ పనులు చేపడుతుంది. దీంతో పుష్కరఘాట్ పులకించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయనే చర్చ జరుగుతోంది.

భారీ డార్మెటరీ హౌస్..


వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తున్న డార్మెటరీ హౌస్

కాళేశ్వరం: సరస్వతీ(వీఐపీ)ఘాట్ వద్ద భక్తుల సౌకర్యార్థం టెంట్‌సిటీలతోపాటు భారీ డార్మెటరీ హౌస్ నిర్మాణం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన ఆలిఎలిమెంట్ అనే సంస్థ డార్మెటరీ హౌస్ ఏర్పాటు చేస్తోంది. అన్ని వసతులతో సుమారు 300 మంది సేదదీరేలా, రూ.500 అద్దెతో 22గంటల సమయం వరకు తీసుకునున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎప్‌సెట్ సాధించారు

టీజీఎప్‌సెట్–2025లో ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు మెరిశారు. ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. దీనిపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మానుకోట విద్యార్థుల ప్రతిభ


సహృదయ్


వశిష్టగౌడ్

మహబూబాబాద్ అర్బన్: టీజీఎప్‌సెట్ ఫలితాల్లో మానుకోట జిల్లా కేంద్రంలో ధర్మన్నకాలనీకి చెందిన సందా ఉపేందర్, మనీష దంపతుల కుమారుడు సహృదయ్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 858వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా ఉమ్మగాని మధు, కృష్ణవేణి దంపతుల కుమారుడు వశిష్టగౌడ్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 908వ ర్యాంకు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మార్గదర్శి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమ్మగాని అరుణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

మెరిసిన రైతు బిడ్డ..

- స్టేట్ 404వ ర్యాంకు సాధించిన స్వాతి


స్వాతి

నెల్లికుదురు: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టీజీ ఎప్‌సెట్ ఫలితాల్లో రైతు బిడ్డ మెరిసింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన బొమ్మెర స్వాతి 97.26 మార్కులు సాధించి స్టేట్ 404 ర్యాంకర్‌గా నిలిచింది. గ్రామానికి చెందిన బొమ్మెర ఉప్పలయ్య, సారమ్మ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. తమకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. స్వాతి 10వ తరగతి కల్లెడలోని ఆర్‌డీఎఫ్ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్ కల్లెడలోని వీపీవీ కళాశాలలో చదివింది. కాగా, డాక్టర్ కావడమే తన లక్ష్యమని స్వాతి తెలిపింది. కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు స్వాతిని అభినందించారు.

దేవరుప్పల బాలికల సత్తా..


శ్రీనిజ


స్నిగ్ధ

దేవరుప్పల: టీజీఎప్‌సెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బాలికలు స్టేట్ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. అంబటి లక్ష్మి, సోమన్న దంపతుల కూతురు శ్రీనిజ రాష్ట్ర స్థాయిలో 3,065 ర్యాంకు, ఎల్పుల వరలక్ష్మి, చంద్రప్రకాశ్ దంపతుల కూతురు స్నిగ్ధ రాష్ట్ర స్థాయిలో 3,961 ర్యాంకు సాధించింది. దీనిపై కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మెరిసిన భూపాలపల్లి జిల్లా విద్యార్థులు


అక్షయపటేల్


నిరంజన్

భూపాలపల్లి అర్బన్: టీజీఎప్‌సెట్ ఫలితాల్లో భూపాలపల్లి జిల్లా విద్యార్థులు మెరిశారు. ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన మేనం అక్షయపటేల్ అగ్రికల్చర్ విభాగంలో 2,648 ర్యాంకు సాధించింది. చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన ముదురుకొళ్ల నిరంజన్ ఇంజనీరింగ్ విభాగంలో 12,868 ర్యాంకు సాధించాడు.

తరుణ్‌కు 325 ర్యాంకు


తరుణ్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం అయోధ్య జీపీ పరిధిలోని భజన తండాకు చెందిన గుగులోత్ నెహ్రూ, సత్తి దంపతుల పెద్ద కుమారుడు తరుణ్ టీజీ ఎప్‌సెట్ ఫలితాల్లో 325 ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ హయత్‌నగర్ ప్రాంతంలోని ఓ కళాశాలలో 2024 మార్చిలో ఇంటర్ ఎంపీసీ పూర్తిచేసిన తరుణ్.. కూకట్‌పల్లిలోని ఓ కోచింగ్ సెంటర్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నాడు. ప్రస్తుతం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో 325 ర్యాంకు సాధించి సహ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. కాగా, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కావాలన్నదే తన లక్ష్యమని తరుణ్ పేర్కొన్నాడు.

ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూం ప్రారంభం


ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూంను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్: కరీంనగర్‌లోని విట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన బుల్ కన్‌స్ట్రక్షన్స్ ఎక్విపెమెంట్ ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూంను 'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ జోన్ హెడ్ వి.సోమసుందరం, స్టేట్ హెడ్ ఎస్.సురేశ్ బాబు, షోరూం డీలర్ అంబటి జోజిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. బుల్ కంపెనీకి సంబంధించి స్టాండర్డ్ పోర్ట్, స్టాండర్డ్ క్వాలిటీ, సూపర్ ఫర్ఫార్మెన్స్ ఉంటుందన్నారు. బుల్ కన్‌స్ట్రక్షన్స్ ఎక్విప్‌మెంట్ ద్వారా గంటకు లీటర్ డీజిల్ ఆదా అవుతుందన్నారు. సర్వీస్ విషయంలోనూ 100శాతం క్వాలిటీ అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ జగ్గారెడ్డి, ఫాదర్ సంతోశ్ పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి ఉపాధి కల్పిస్తాం

- ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు


నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి: కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థికి ఉపాధి కల్పిస్తామని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. అల్లాడి క్లౌడ్ సొల్యూషన్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన ఐదుగురు విద్యార్థినులకు ఆదివారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వివిధ కంపెనీలను ఆహ్వానించి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, ఈఏడాది 234 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. వారిని తిరుమల్‌రావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎస్‌వీఎస్ విద్యాసంస్థల డైరెక్టర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

మళ్లీ సాయంత్రం బడులు

- సామాజిక చైతన్య కేంద్రాల ద్వారా విద్యా బోధన
- జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభం
- నేడు గ్రామస్థాయి సమావేశాలు



హసన్‌పర్తి: సంపూర్ణ అక్షరాస్యత కోసం ప్రభుత్వం మళ్లీ సాయంత్రం బడులు ప్రారంభించనుంది. సామాజిక చైతన్య కేంద్రాల పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. గతంలో వయోజన కేంద్రాల ద్వారా సాయంత్రం బడులు నిర్వహించారు. గ్రామంలో 19 ఏళ్ల పైబడి ఉండి చదువు రాని వారు ఈ కేంద్రాలకు వచ్చి చదువుకునేవారు. ఇందుకు ప్రత్యేక వలంటీర్లను నియమించారు. 20 ఏళ్ల క్రితం ఈ కేంద్రాలు రద్దయ్యాయి.

సామాజిక చైతన్య కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్య కేంద్రాల స్థానంలో సామాజిక చైతన్య కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. మండల స్థాయిలో ఎంఈఓ కన్వీనర్‌గా, ఇందిరా క్రాంతి పథం ఏపీఓ కోకన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గ్రామస్థాయిలో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, పీఏసీఎస్ చైర్మన్ కోకన్వీనర్‌గా, స్వయం సహాయక సంఘం సభ్యురాలు, విశ్రాంత ఉపాధ్యాయుడు, స్వచ్ఛంద సంస్థ సభ్యుడి సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈనెల 12 తర్వాత అర్హుల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు.

'ఉల్లాస్' యాప్‌లో..

చదువురాని వయోజనులను గుర్తించి వారి పేర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో గ్రామాల్లో ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారో స్పష్టం కానుంది.

నేడు గ్రామస్థాయి సమావేశాలు..

ఈనెల 12న గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అధ్యక్షతన ఈ సమావేశం ఉంటుంది.

జూన్ 1 నుంచి ప్రారంభం

సామాజిక చైతన్య కేంద్రాలు జూన్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు ఎంఈఓ రాజిరెడ్డి తెలిపారు. చదువు చెప్పడానికి ముందుకు వచ్చేయ వారికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో వందశాతం అక్షరాస్యత సాధించే దిశలో కృషి చేయాలని కోరారు.

టీజీఎప్‌సెట్‌లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం


నాగసిద్ధార్థ


ఎం. వినయ్


అబ్దుల్లా మొహినుద్దీన్


అంజనా సంతోషి

విద్యారణ్యపురి: టీజీఎప్‌సెట్– 2025 ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని, ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో వి.నాగసిద్ధార్థ 32వ ర్యాంకు సాధించారని ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో మేధాకార్తీక్ 234వ ర్యాంకు, జోగు అభిరామ్ 471వ ర్యాంకు, బీపీసీ విభాగంలో ఎం. వినయ్ 149వ ర్యాంకు, ఎండి. అబ్దుల్లా మొహినుద్దీన్ 162వ ర్యాంకు సాధించారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్‌ఆర్ విజయపథాన్ని ఎగురవేశారని వివరించారు. కె. అంజనాసంతోషి 178 ర్యాంకు, పి.సాయి దివ్యాన్ 183వ ర్యాంకు, కె.సాయికిరణ్ 200వ ర్యాంకు, జి. సాయిహర్షిణి 268వ ర్యాంకు, వై. స్నేహితారెడ్డి 390వ ర్యాంకు, కె. ఏంజెల్ 412వ ర్యాంకు, వి. ప్రత్యున్నారెడ్డి, 475వ ర్యాంకు, తోట ప్రణయా 496వ ర్యాంకు, మహ్మద్‌షాహిద్ రెహాన్ 513వ ర్యాంకు, చల్లా అన్సికా 539వ ర్యాంకు సాధించారని తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరిస్తూ తమ విద్యాసంస్థల విద్యార్థులకు సృజనాత్మకతతోకూడిన విద్యనందిస్తున్నామని వారు తెలిపారు.

టీజీఎప్‌సెట్‌లో 'షైన్' విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్, డైరెక్టర్లు

హన్మకొండ: టీజీఎప్‌సెట్–2025 ఫలితాల్లో షైన్ విజయకేతం ఎగురవేసింది. రాష్ట్ర స్థాయిలో 181, 277, 1279 ర్యాంకులు సాధించి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించిందని షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగల రమ, మూగల రమేశ్ తెలిపారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి జే.ఈ.ఈ. మెయిన్స్, నీట్, ఈఏపీసీఈటీలో అత్యుత్తమ శిక్షణ వరంగల్‌లో అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళిక ద్వారా ఆణిముత్యాలుగా తీర్చిదిద్దుతూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. టీజీఎప్‌సెట్ అగ్రికల్చర్ కేటగిరీలో డి.ఇందు 181 ర్యాంకు సాధించిందని తెలిపారు. కె.సహస్ర 277, బి.సంధ్య 2,227, ఎం.రమ్య 2,963, ఇ.సాహితీ 4,879, ఇంజనీరింగ్ కేటగిరీలో పి.శ్రీ మహేశ్ 1,279, ఎం.వరుణ్ 3,153, సి.హెచ్.సరిసహస్ర 4,133, కె.కస్తూరి 5,741, కె.చాణక్య 5,962, కె.విష్ణు 6,915, జి.నిగమ 7,009, ఎస్.శ్రీచైతన్య 8,162, ఎం.సుశాంత్ 8,795 ర్యాంకు సాధించారని వివరించారు. వీరితో పాటు అగ్రికల్చర్ కేటగిరీలో 23 మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు, ఇంజనీరింగ్ కేటగిరీలో 31 మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు సాధించారని చైర్మన్ తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమములో షైన్ విద్యా సంస్థల కళాశాలల ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంధ్య, ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'రెజోనెన్స్' విద్యార్థుల ప్రతిభ


రావుల ఇక్షవర్


సాయి రోహన్


నాగసాయి

హన్మకొండ: టీజీఎప్‌సెట్–2025 ఫలితాల్లో రెజోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తమ విద్యార్థులు రావుల ఇక్షవర్ 265వ ర్యాంకు, ఎ.సాయి రోహన్ 467, ఎ.నాగసాయి 806 ర్యాంకు సాధించారని రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. 272 మంది విద్యార్థులు 10,000 కంటే తక్కువ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం తమ విద్యాసంస్థ కృషి చేస్తోందన్నారు. తమ అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల అవిశ్రాంత కృషి, వారి తల్లిదండ్రుల నిరంతర సహకారంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య రాజిరెడ్డి పాల్గొన్నారు.

'శివాని' విద్యార్థుల సత్తా

విద్యారణ్యపురి: టీజీఎప్‌సెట్ ఫలితాల్లో శివాని జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారని ఆ కళాశాల కరస్పాండెంట్ టి. స్వామి, ప్రిన్సిపాళ్లు సురేందర్‌రెడ్డి వి. చంద్రమోహన్ తెలిపారు. డైరెక్టర్లు టి. రాజు, ఎన్. రమేశ్, ఎ. మురళీధర్.వి సురేశ్, ఎస్. సంతోశ్ రెడ్డి ఆదివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.అరికిల్ల నిస్సీ 1,309వ ర్యాంకు, ఆరె హాసిని 1,352వ ర్యాంకు, మార్గం హారిక 1,852వ ర్యాంకు, కోరె ఓం చందర్ 2,592వ ర్యాంకు, పాడి శ్రీవాణి 2,785వ ర్యాంకు, గుగులోత్ తరుణ్ 3,299వ ర్యాంకు, గుగులోత్ రమేశ్ 3,988వ ర్యాంకు, సల్మా4,527వ ర్యాంకు, మారం లక్ష్మణ్ 4,533వ ర్యాంకు, తమ్మడబోయిన అభిరామ్ 5,678వ ర్యాంకు సాధించారని వారు తెలిపారు.


అరికిల్ల నిస్సీ


మార్గం హారిక


ఓం చందర్


పాడి శ్రీవాణి